క్లుప్తంగా

6 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 6,7,8 తేదీల్లో కడప మండల స్థాయిలో అండర్–14, 17 బాల బాలికలకు ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కడప మండల కో–ఆర్డినేటర్ మహబూబ్ బాష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న చెస్, యోగా, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, 7న ఖోఖో, వాలీబాల్, 8న అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు కడప డీఎస్‌ఎ స్టేడియం లో హాజరుకావాలన్నారు.

5న సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 5న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ బాలోత్సవ భవన్‌లో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు డిస్కమ్ అధ్యక్షుడు శివ శంకర్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శిల్పారామంలో సందడి

కడప సెవెన్ రోడ్స్: కడప శిల్పారామంలో గురువారం దసరా సందడి కనిపించింది. ఈ పండుగ సందర్భంగా శిల్పారామంలో ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మూవీ పద్మాకర్ సహకారంతో సంప్రదాయ వేదిక చిన్నారులు నృత్యాలతో కనువిందు చేశారు. చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లెకు చెందిన కళా తరంగిణి బృందం దసరా ప్రత్యేక గీతాలకు చేసిన నృత్యం ఆకట్టుకుంది. శిల్పారామం ఏఓ ఎస్.కృష్ణప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రిమ్స్‌లో అన్నదానం



కడప ఎడ్యుకేషన్: కడప ఎన్జీవో కాలనీలోని గరుడాద్రి ఎలక్ట్రికల్స్ యజమాని రామసుబ్బయ్య తన భార్య పి వీరమ్మ నాలుగవ వర్ధంతి సందర్భంగా రిమ్స్ ఆస్పత్రి ఆవరణంలో అన్న ప్రసాద వితరణ చేశారు. శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాదంశెట్టి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ / కడప కార్పొరేషన్ : ఎస్సీ ఎస్టీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఎస్సీ ఎస్టీ హైర్ బస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్సీ ఎస్టీ హైర్ బస్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో టెండర్ వేయగా, హైర్ బస్సు లు రావడంతో అప్పు తెచ్చిపెట్టి ఆర్టీసీలో బస్సులు పెట్టామన్నారు. నాటి నుంచి బస్సులు తిప్పుతున్నప్పటికీ అప్పులు కూడా తీరే పరిస్థితి లేదన్నారు. కొంతమందికి అప్పులు కూడా పుట్టక బస్సులు తిప్పలేని పరిస్థితిలో వాటి రుణాలు కట్టలేక బస్సులను సీజ్ చేసే వరకు పరిస్థితి వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రులు మాటలు చెప్తూ ఎస్సీ ఎస్టీలను పారిశ్రామికవేత్తలుగా చేస్తామని నమ్మబలికారు. తీరా చూస్తే తాము మోసపోయినట్లు అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని తమ కష్టాలు గుర్తించి త్వరగా సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఈ విషయంగా ఈనెల 6వ తేదీన ఏపీఐఐసీ కార్యాలయం ముట్టడి చేయాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ ల హైర్ బస్సు ఓనర్లందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో పలువురు ఎస్సీ ఎస్టీ హైర్ బస్సు ఓనర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు



రక్తదానం చేస్తున్న శివశంకర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుపేదల అభ్యున్నతే ధ్యేయంగా గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేశారని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి శివశంకర్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ బ్యాంకు స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆయన గురువారం గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ భారత గ్రామీణ అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన గ్రామీణ బ్యాంకు వ్యవస్థ 50 సంవత్సరాల ప్రయాణం పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించుకుంటోందన్నారు. ఒక విశ్రాంత ఉద్యోగిగా, ఈ బ్యాంకు ద్వారా నేర్చుకున్న సేవా భావంతో 75వ సారి రక్తదానం చేయడం గర్వకారణంగా ఉందన్నారు.

వైభవంగా జగజ్జనని ఊరేగింపు

కడప సెవెన్‌రోడ్స్ : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని గురువారం విశేష అలంకారాలలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అన్ని ఆలయాల్లోనూ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. పది రోజులపాటు పూజలందుకున్న అమ్మవారికి ఉత్సవాలలో చివరిఘట్టంగా నగరోత్సవం నిర్వహించారు. కళ్లు చెదిరే రంగు రంగుల, రకరకాల బాణాసంచా ఒకవైపు, ఉర్రూతలూగించే డీజే బ్యాండ్ శబ్దాలు మరోవైపు, ఉత్సవాలలో పవిత్రతను చాటుతూ ఇంకోవైపు మంగళ వాయిద్యాలు అడుగడుగునా భక్తుల జయజయధ్వానాలు, పూజా ద్రవ్యాల సమర్పణలు, దేవతామూర్తుల దర్శనం చేసుకున్న భక్తుల తన్మయత్వంతో చేసే నృత్యాలు వెరసి గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నగరమంతా హడావుడి కనుల విందు చేసింది. విచిత్ర వేషధారులు అడుగడుగునా సరదా ఆటలతో ఆకర్షణీయంగా నిలిచారు. కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి నగరోత్సవంలో ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. నగరంలోని భక్తులు అడుగడుగునా అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరిమాత ఊరేగింపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాగింది. హనుమప్ప వీధిలోని భద్రావతి భావనారుషి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని పెద్దబెస్తవీధిలోగల బాల పోలేరమ్మ ఆలయం, నడివీధి గంగమ్మ క్షేత్రం, గడ్డిబజారు శ్రీ సత్యనారాయణస్వామి, శ్రీ కామకోటి కళాంబదేవి, నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయం, ఇంకా అన్ని అమ్మవారి ఆలయాల నుంచి గురువారం రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనాలపై కొలువుదీర్చారు. కనువిందు చేసే పూల అలంకారం, రంగురంగుల విద్యుద్దీపాలతో భక్తుల హడావుడితో నగరోత్సవం వైభవంగా సాగింది.



మిరుమిట్లు గొలుపుతున్న బాణసంచా కాంతులు



గ్రామోత్సవంలో ఆకట్టుకున్న వేషధారులు

జమ్మిదర్శనం

మధ్యాహ్నం మూడు గంటల నుంచి దాదాపు అన్ని అమ్మవారి ఆలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శమీ దర్శనం కోసం జమ్మి చెట్టు వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారిని జయజయధ్వానాల మధ్య అట్టహాసంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి ఆకును సేకరించి ఒకరినొకరు బంగారం పేరిట దాన్ని అందజేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విజయం సాధించాలని ఆకాంక్షించారు.



నగర శివార్లలోని శ్రీ లలితాంబిక ఆలయ సమీపంలో జమ్మిచెట్టు వద్ద భక్తుల పూజలు



గ్రామోత్సవంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

కడప అర్బన్: విజయ దశమి (దసరా) పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని ఆయుధాగారంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయుధాలు, మోటార్ ట్రాన్స్ పోర్ట్ విభాగం లో పలు వాహనాలకు పూజలు చేశారు. జిల్లా పోలీసు ఆయుధాగారం ఆవరణలో దుర్గా మాత చిత్రపటం వద్ద అన్నిరకాల తుపాకులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ఉత్సవాలలో బందోబస్తు

కడప అర్బన్: నగరంలో దసరా ఉత్సవాల నేపథ్యంలో గురువారం రాత్రి అమ్మవారిశాల, విజయదుర్గా దేవి ఆలయాలను ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సందర్శించి పోలీస్ అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎలాంటి ఘటనలకు తావులేకుండా చూడాలన్నారు.

చంద్రబాబు దళిత ద్రోహి

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని, అంబేద్కర్ భావజాలంపై టీడీపీ ఆది నుంచి విషం చిమ్ముతోందని సోషల్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు పాలనలో నిత్యం దళితులపై దాష్టీకాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు అపచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలోని వెదురుకుప్పం మండలం దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ మూకలు నిప్పు పెట్టాయని అన్నారు. ఈ ఘటనకు కారకుడైన టీడీపీ నేత సతీష్‌నాయుడిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టకూడదని టీడీపీ నేత సతీష్ నాయుడు అడ్డుకున్నాడని, అయినా స్థానికంగా ఉన్న దళితులు ధైర్యంగా ముందుకు వచ్చి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనిని ఓర్వలేక సతీష్ నాయుడు, అతడి అనుచరులే అర్ధరాత్రి సమయంలో ఈ విగ్రహానికి నిప్పు పెట్టారన్నారు.

దళిత సంఘాలు స్పందించాలి

పర్చూరు నియోజకవర్గం మార్టూరు మండలం డేగరమూడి గ్రామంలో దళిత యువకులు జగనన్న కాలనీ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో టీడీపీ నేతలు వారిని పోలీస్ స్టేషన్‌లో పెట్టించారన్నారు. పోలీసులు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, దారుణంగా హింసించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పిఠాపురం నియోజవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారని, కందుకూరు నియోజకవర్గం దప్పళంపల్లి, అన్నమయ్య జిల్లా రాజంపేటలో దళితులను బహిష్కరించిన ఘటనలను ప్రజలు మరిచిపోలేదన్నారు. దళితులపై జరుగుతున్న దాష్టీకాలపై దళితసంఘాలు స్పందించాల్సిన అవసరముందన్నారు.

మహాత్మాగాంధీ ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందాం

కడప అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గురువారం జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారిని ఎదిరించి, శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి చరిత్రలోనే మహోన్నత వ్యక్తిగా, జాతిపితగా నిలిచారని కొనియాడారు. అలాంటి మహనీయుని ఆలోచనలు, ఆశయాలు అందరికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అలాగే భారతరత్న, దేశ రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు స్ఫూర్తిదాయకం అని ఎస్పీ కొనియాడారు. ఆ మహనీయుని జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, డి.సి.ఆర్.బి సీఐ ఈశ్వర్ రెడ్డి, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, టైటస్, ఏ.ఓ వెంకటరమణ, టూ టౌన్ సీఐ జి.సుబ్బారావు, రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి , చిన్నచౌక్ సీఐ ఓబులేసు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పు శంకర్, ఆర్.ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ



గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

జాతిపితను స్మరించుకోవడం బాధ్యత

కడప సెవెన్‌రోడ్స్ : జాతిపిత మహాత్మాగాంధీని స్మరించుకోవడం భారతీయులందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కడప నగరం ఐటీఐ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నేటితరం మహాత్ముడిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానవత సంస్థ ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి, వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, పీఆర్‌ఓ పప్పనబోయిన సుబ్బరాయుడు, కార్యదర్శి అవ్వారు సుబ్బయ్య, రిలయన్స్ మాధవరెడ్డి, సమ్మెట సత్యనారాయణ, లేవాకు కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు

కడప ఎడ్యుకేషన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని రెండవ గాంధీ బొమ్మ సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ హ్యూమెన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ షా మొహమ్మద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మహాత్మా...మా సమస్యలు పరిష్కరించండి

కడప కార్పొరేషన్: మహాత్మా...మా సమస్యలను పరిష్కరించండి అంటూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కోరారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా వారు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపిస్తామని తమను ఉద్యోగులుగా నియమించారని, నేడు తమ సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ వద్ద గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అంబేడ్కర్ విగ్రహానికి నిప్ప దారుణం



మాట్లాడుతున్న కైపు రామాంజనేయులు

కడప సెవెన్‌రోడ్స్ : చిత్తూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమని దళిత మిత్ర సంఘం అధ్యక్షులు కైపు రామాంజనేయులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడమంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై చేసిన దాడిగానే పరిగణించాలన్నారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛకు ప్రతీకలుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలను దహనం చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఈ సమావేశంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మురహరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పరువు మర్యాదలను బజారుకీడ్చేలా అక్రమ కేసులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పరువు, మర్యాదలను బజారుకీడ్చేలా పోలీసులు అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో టీడీపీకి చెందిన ఓ మహిళ ఎమ్మెల్యే మాధవిని తిడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగిందన్నారు. ఏడాదిన్నర తర్వాత అది వాట్సాప్‌లో వస్తే దానిని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష పీఏ ఖాజా వేరొకరికి షేర్ చేశాడనే కారణంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాల్సిన ఈ కేసులో పోలీసులు ఎమ్మెల్యే మెప్పు కోసం ఒక ఎస్ఐ, ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లతో హైదరాబాద్ పోయి ఎక్కడెక్కడో తిప్పుతూ కడపకు తీసుకొచ్చి దొంగలు, దోపిడీదారులు, రౌడీషీటర్లకు వేసినట్లు ముఖానికి ముసుగు వేసి మీడియా ముందు ప్రవేశపెట్టడం దారుణమన్నారు. పోలీసులు పెట్టిన ఈ అక్రమ కేసుపై కోర్టు కూడా మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష కు కూడా నోటీసులు ఇవ్వాలని పోలీసులు ప్రయత్నించారన్నారు. కేవలం షేర్ చేసినంత మాత్రానా కేసు పెట్టి అరెస్ట్ చేస్తారా... ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి తదితరులు

అధికార పార్టీ చేసే తప్పులను ప్రజలకు తెలపడం మా హక్కు...

అధికార పార్టీ నేతలు చేసే తప్పులను ఎత్తిచూపుతూ ప్రజలకు తెలియజేయడం ప్రతిపక్ష పార్టీగా అది తమ హక్కు అని వైఎస్‌ఆర్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. టీడీపీ నాయకులు వాళ్లలో వాళ్లు కొట్టుకుంటూ, తిట్టుకుంటూ బజారున పడుతున్నారని, ఈ విషయాన్ని తాము అన్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపడం తమ బాధ్యతన్నారు. వీధిలో మహిళలు కొట్లాడితే తమ పార్టీ నాయకుడిపై రేప్ కేసు పెట్టి రౌడీషీట్ తెరిచారని, మూడేళ్లక్రితం కేసు నమోదై రాజీ అయిన కేసులో అహ్మద్‌బాషాను ఉగ్రవాదిని తీసుకొచ్చినట్లు ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేసి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు తమ పార్టీ నేత జయచంద్రారెడ్డి షాపులను ఆక్రమణల పేరిట పగులగొట్టారన్నారు. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం పీఏ ఖాజాను దుర్మార్గంగా అరెస్ట్ చేశారన్నారు. మున్సిపల్‌ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను తరిమి తరిమి కొట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. ఎవరిని తరిమి కొట్టాలో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం పీఏ ఖాజా భార్య నిండు గర్భవతి అని, ఆమెను చూసుకోవడానికి అతను హైదరాబాద్ వెళ్లాడన్నారు. ఫోన్ చేసి పిలిచినా అతను వస్తాడని, కానీ పోలీసులు హైదరాబాద్ వెళ్లి ఆయన్ను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టులు ఇలాంటి కేసులు నమోదు చేయవద్దని చెబుతున్నా పోలీసులు వినడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్, సింధే రవి, కంచుపాటి బాబు, బన్నా పాల్గొన్నారు.



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా కడప రాయుని కల్యాణం

కడప సెవెన్‌రోడ్స్ : తిరుమలకు తొలిగడపగా భావించే కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపైగల ప్రత్యేక పీఠాలపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంటూరు - తిరుపతి రైలు ధర్మవరం వరకు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గుంటూరు–తిరుపతి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (17261) ధర్మవరం వరకు పొడిగించారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. నవంబరు 23న శ్రీ సత్యసాయి జయంతిని పురస్కరించుకుని రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 30వ తేది వరకు రెండు నెలలపాటు ఈ రైలు ధర్మవరం వరకు నడుపుతారన్నారు. గుంటూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి నరసరావుపేట, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, రాజంపేట మీదుగా తెల్లవారుజామున 3.55 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. అక్కడి నుంచి తెల్లవారుజామున 4.05 గంటల వరకు బయలుదేరి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లెరోడ్డు, ములకలచెరువు, కదిరి మీదుగా ఉదయం 9.00 గంటలకు ధర్మవరం చేరుతుందన్నారు. తిరిగి ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయదేరి సాయంత్రం 7.15 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. తిరుపతిలో 7.20 గంటలకు బయలుదేరి ఇదేమార్గంలో గుంటూరుకు మరుసటిరోజు ఉదయం 7.20 గంటలకు చేరుతుందని ఆయన వివరించారు.

బజాజ్ మేళాకు స్పందన



కస్టమర్‌కు తాళాలు అందజేస్తున్న షోరూం యజమాని అహ్మద్

కడప ఎడ్యుకేషన్: హరూన్ బజాజ్ విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసిన మేళాలో అపూర్వ స్పందన లభించింది. ప్రత్యేక రాయితీలు అందుకున్న ప్రతి కస్టమర్ 20వేల రూపాయలకు పైగా ఆదా పొంది సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు 2 వీలర్ కొనాలి అనుకునే ప్రజలకు మంచి ఆఫర్ అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. విజయ దశమి మేళాలో 1540 వాహనాలు అమ్ముడయ్యాయని అన్నారు. ఇంతటి ఆదరణ అందించిన కస్టమర్‌లకు ధన్యవాదాలు అని షోరూం యజమాని అహ్మద్ తెలిపారు. ఈ అవకాశాన్ని దీపావళి వరకు పొడిగించామని తెలిపారు. కార్యక్రమంలో షోరూం జీఎం పరమేశ్వరరెడ్డి, సేల్స్ మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్: జేఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 5వ తేదీన కడపలోని క్రిష్టా సర్కిల్‌లోని రహమతుల్లా ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. మల్లికార్జున్ రెడ్డి, కడప జిల్లా కార్యదర్శి కె. కృపాకర్, ఉపాధ్యక్షులు మల్లికార్జునలు ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర స్థాయి సమావేశంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగుతామన్నారు. జేఎల్ఎం గ్రేడ్–2లంతా ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఇంజనీరింగ్ సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ సెక్షన్ ఈడీఏ చెంగల్ రెడ్డి ఆదేశించారు. తొలుత ఆయన జోనల్‌స్టోర్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. శుక్రవారం చెంగల్‌రెడ్డి కడపలోని ఆర్టీసీ వర్క్‌షాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో బ్రేక్‌డౌన్ ఆపరేషన్ల ఆవశ్యకత గురించి వివరించారు. యంత్రాల పని స్థితిపై ఆరా తీసి వివిధ విభాగాల ఉద్యోగులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ హరి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాములూరు గుట్టలను కాపాడాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : వేంపల్లి మండలం పాములూరు గుట్టలను చెరబట్టిన తెలుగుదేశం పార్టీ నేత ఎద్దుల శేషారెడ్డి నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేంపల్లి–పులివెందుల మెయిన్ రోడ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమణ చేసి పంట సాగుచేస్తున్నా వేంపల్లి రెవెన్యూ అధికారులు మిన్నకుండి పోయారని మండిపడ్డారు. ఎద్దుల శేషారెడ్డి తన వెనుక జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి ఉన్నాడని పదే పదే గ్రామస్తులను బెదిరిస్తున్నారన్నారు. పాములూరు గుట్టలు అమ్మగారిపల్లె, మర్రిపల్లె, పాములూరు, అయ్యవారిపల్లె , నాగూరు గ్రామస్థుల పశువుల పెంపకం కోసం ఉండేదని, ఇప్పుడు దాని విలువ కోట్ల రూపాయల విలువైన స్థలం ఆక్రమణ జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ నేత ఎద్దుల శేషారెడ్డి గతంలో పాపాఘ్ని నది ప్రాంతాన్ని ఆక్రమణ చేసి అమ్ముకోవడం కూడా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సత్తార్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక నేత అవ్వారు మల్లికార్జున , జనతాదల్ పార్టీ నేత ప్రతాప్ రెడ్డి ,రాయలసీమ అభివృద్ధి వేదిక నేత కారు ఆంజనేయులు , హేతువాద సంఘం నేత సి.ఆర్.వి ప్రసాద్ర రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసులు, సీపీఐ ఎంఎల్ డబ్ల్యూ రాము, లోక్ సత్తా నేత దేవరకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.